మహాశివరాత్రి నాడు

జాగరణ ఎందుకు..?



4లో.


జర్నలిస్ట్ వార్త

RNI NO :Title-Code :-TELTEL02102

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103



సంపుటి - 1 సంచిక - 163 శుక్రవారం 8 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# గవర్నర్ కోటా ఎంఎల్‌సిల నియామకం రద్దు

**కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను నామినేట్ చేస్తూ జారీ చేసిన గెజిట్‌ను కొట్టివేసిన హైకోర్టు**

**ఎంఎల్‌సిల నియామకంపై ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని సూచన**

**గత బిఆర్ఎస్ ప్రభుత్వ సిఫారసుపై గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పు పట్టిన న్యాయస్థానం**



**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణలను నియమించాలంటూ రాష్ట్ర కేబినెట్ చేసిన సిఫార్సులపై గవర్నర్ వ్యవహరించిన తీరు సరికాదని రాష్ట్ర హైకోర్టు పేర్కొంది. సదరు సిఫార్సులను తిరస్కరిస్తూ 2023 సెప్టెంబర్ 19న గవర్నర్ ఇచ్చిన ఆదేశా లను రద్దు చేసింది. దీంతోపాటు గవర్నర్ ఆదేశాల మేరకు కోదండరామ్, ఆమెర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ఈ ఏడాది జనవరి 27న ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేసింది. మళ్లీ కొత్తగా ఎమ్మెల్సీల నియామకం చేపట్టాలని.. మరోసారి ఎమ్మెల్సీల పేర్లను కేబినెట్ లో ప్రతిపాదించి గవర్నర్‌కు పంపాలని స్పష్టం చేసింది. మిగతాది 2లో...

## కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు...

# ప్రజావ్యతిరేక పాలన

**కాళేశ్వరం విషయంలో బద్నాం చేయాలని రేవంత్ రెడ్డి**

**ప్రభుత్వం కృత్రిమ కరవును సృష్టించింది: కవిత**

**రేవంత్ రెడ్డి బీజేపీతో కలుస్తారని జోస్యం**

**జీవో 3 రద్దు కోసం అనుమతివ్వకపోయినా ధర్నా చేస్తామని స్పష్టీకరణ**



**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ఉద్దేశ్యంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృత్రిమ కరవును సృష్టించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళా వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఎప్పటికైనా బీజేపీతో కలుస్తారని జోస్యం చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని... ప్రజావ్యతిరేక పాలన అని మండిపడ్డారు. జీవో 3 ద్వారా ఆడబిడ్డలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవోను రద్దు చేసే వరకు న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తమకు అనుమతి ఇవ్వకపోయినా జీవో 3 రద్దు కోసం ధర్నా చేసి తీరుతామని తేల్చి చెప్పారు.

## రేవంత్ రెడ్డి పాలన చూశాక ప్రజలకు

# గాడిద ఎవరో... గుర్రం ఎవరో తెలుస్తుంది

**కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్**

**రేవంత్ రెడ్డి అబద్ధాల పాలన మీద మార్చి 12న సభ పెడుతున్నామన్న కేటీఆర్**

**ఓ ముఖ్యమంత్రి అయి ఉండి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నాను.. మానవ బాంబును అవుతానని మాట్లాడటం ఏమిటని ఆగ్రహం**



2లో.

# మా డిమాండ్లకు కేంద్రం సానుకూలం

**: మల్లు భట్టి విక్రమార్క**

- **సింగరేణి సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లామన్న ఉపముఖ్యమంత్రి**
- **కేసీఆర్, కేటీఆర్‌లు ఇంజనీర్లేమీ కాదని... ఎక్కువ ఊహించుకుంటున్నారని ఎద్దేవా**
- **కాళేశ్వరం ప్రాజెక్టును వాళ్లు డిజైన్ చేయడం వల్లే డ్యామేజ్ అయిందని ఆరోపణ**



**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ కోసం తాము పెట్టిన పలు డిమాండ్లకు కేంద్రమంత్రులు సానుకూలంగా స్పందించారని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి సమస్యలను తాము కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లామని తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్, కేటీఆర్‌లు ఇంజనీర్లేమీ కాదని... కానీ వారే ఎక్కువ ఊహించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును వాళ్లు డిజైన్ చేయడం వల్లే డ్యామేజ్ అయిందని ఆరోపించారు. నిపుణుల కమిటీ నివేదిక వచ్చే వరకు అడ్డగోలుగా మాట్లాడవద్దని సూచించారు.సౌర విద్యుత్ ఉత్పత్తిని గ్రామీణ ప్రాంతంలో కూడా తాము ప్రోత్సహిస్తామన్నారు. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. సౌర విద్యుత్‌తో పర్యావరణానికి కూడా మేలు జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ నేతలు అధికారంతో పాటు ఆలోచనా జ్ఞానాన్ని కూడా కోల్పోయారని విమర్శించారు. వేసవిలో నీటి ఎద్దడి సమస్య రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు చెప్పారు. తాము సరైన సమయంలో లోక్ సభ అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు.

# రాజీవ్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్

- **బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో గంజాయి, పబ్బులు, డ్రగ్స్ వచ్చాయి : రేవంత్ రెడ్డి**
- **రాజీవ్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూమిపూజ చేసిన సీఎం**
- **గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో వివాదం కారణంగా ఈ ప్రాజెక్టును పక్కన ఎట్టిందని ఆరోపణ**



**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో గంజాయి, పబ్బులు, డ్రగ్స్ వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. సికింద్రాబాద్ అల్వాల్ టిమ్స్ సమీపంలో రాజీవ్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గురువారం ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. 11 కిలో మీటర్ల పొడవుతో 6 లైన్లతో రూ.2,232 కోట్లతో భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తాను ఎలివేటెడ్ కారిడార్ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజల అవసరాలను మరిచిపోయిందని ఆరోపించారు. గత ప్రభుత్వం కేంద్రంతో వివాదం కారణంగా ఈ ప్రాజెక్టును పక్కన పెట్టిందని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక రాజీవ్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాధాన్యతను కేంద్రానికి వివరించానని తెలిపారు. మేడ్చల్ అభివృద్ధి చెందాలంటే ఇది పూర్తి కావాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో నగరంలో కూడా అభివృద్ధి జరగలేదని విమర్శించారు. రెండో దశలో 75 కిలో మీటర్ల మెట్రో విస్తరణ చేపట్టబోతున్నామన్నారు.

# ఉద్యోగులకు డీఏను 4 శాతం పెంచుతూ కేంద్ర కేబినెట్ ఆమోదం

**జనవరి 1, 2024 నుంచి ఉద్యోగులకు డీఎ, పెన్షనర్లకు డీఆర్ వర్తింపు**

**ఈ నిర్ణయంతో 49.18 లక్షల ఉద్యోగులకు, 67.95 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం కలుగుతుందని వెల్లడి**



**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. డీఏ (డియర్‌నెస్ అలవెన్స్)ను 4 శాతం పెంచుతూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్లకు 4 శాతం డీఏను పెంచుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జనవరి 1, 2024 నుంచి ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ వర్తిస్తాయి. లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ఈ నెలాఖరులోగా వచ్చే అవకాశం ఉన్నందున కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ నిర్ణయం వెలువడింది.కేబినెట్ నిర్ణయాలకు సంబంధించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం వల్ల 49.18 లక్షల మంది ఉద్యోగులకు, 67.95 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ఖజానాకు ప్రతి ఏటా రూ.12,868.72 కోట్ల భారం పడుతుందన్నారు. ఏడో వేతన సంఘం సిఫార్సుల మేరకు పెంపుదల ఉంటుందని తెలిపింది. కాగా, కేబినెట్ సమావేశంలో ఏఐ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయించింది. ముడి జనపనారకు మద్దతు ధరను రూ.285కు పెంచింది. ముడి జనపనారకు క్వింటాల్‌కు కనీస మద్దతు ధరను రూ.5335గా నిర్ధారించింది.

# రేవంత్ రెడ్డి తిట్టాలనుకుంటే చంద్రబాబును తిట్టాలి: హరీశ్ రావు

**పాలమూరు వెనుకబాటుతనానికి చంద్రబాబు, కాంగ్రెస్ పార్టీనే కారణమన్న హరీశ్ రావు**

**పాలమూరును చంద్రబాబు దత్తత తీసుకొని చేసిందేమీ లేదని విమర్శ**

**రేవంత్ రెడ్డి పాలనలో పౌరుషాన్ని చూపించాలి తప్ప తిట్టడంలో కాదని చురక**



**మార్చి 7 జర్నలిస్ట్ జర్నీ న్యూస్:** మహబూబ్‌నగర్ వెనుకబాటుతనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎవరినైనా తిట్టాలనుకుంటే తన గురువుగారైన చంద్రబాబును తిట్టాలి... నిందించాల్సి వస్తే పాలమూరుకు కాంగ్రెస్ చేసిన మోసాన్ని నిందించాలని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. సంగారెడ్డిలో పార్టీ నాయకులతో కలిసి హరీశ్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాలమూరు వెనుకబాటుతనానికి నాటి టీడీపీ, కాంగ్రెస్ పాలనే కారణమని ఆరోపించారు. చంద్రబాబు పాపాలు, కాంగ్రెస్ లోపాలు పాలమూరు పాలిట శాపాలుగా మారాయన్నారు. మహబూబ్‌నగర్ వేదికగా రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను ఖండిస్తున్నట్లు చెప్పారు. పాలమూరు వలసలకు కారణం టీడీపీ, కాంగ్రెస్ పార్టీలే అన్నారు. గత పార్టీలు ప్రాజెక్టుల పేర్లు మార్చారు తప్ప పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో పాలమూరు ప్రాజెక్టులను పెండింగ్ ప్రాజెక్టులుగా మార్చారన్నారు. ఆ పెండింగ్ ప్రాజెక్టులను బీఆర్ఎస్ హయాంలో రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామన్నారు. పాలమూరు పచ్చబడేలా చేసింది కేసీఆరేనని తెలిపారు. బీఆర్ఎస్ కారణంగా పాలమూరుకు మళ్లీ వలసలు తిరిగి వచ్చాయన్నారు. 2014కు ముందు పాలమూరు ఎలా ఉండేది.. ఇప్పుడెలా ఉందో చూడాలన్నారు. పాలమూరును ఆనాడు చంద్రబాబు దత్తత తీసుకున్నారని, పదేళ్లు అధికారంలో ఉన్నా ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. కరవుతో కాంగ్రెస్, టీడీపీలు నాడు రాజకీయాలు చేశాయని మండిపడ్డారు. పాలమూరు ప్రాజెక్టుకు తాము అనుమతులు తెచ్చామని, కాంగ్రెస్ కాల్వలు తవ్వాలని సూచించారు. నాడు పోతిరెడ్డిపాడు నుంచి వైఎస్ రాజశేఖరరెడ్డి నీళ్లు తీసుకెళుతుంటే రేవంత్ రెడ్డి మాట్లాడలేదన్నారు. 30 ఏళ్లలో కల్వకుర్తి ఆయకట్టు కింద 13 వేల ఎకరాలకు నీళ్లిచ్చారని, బీఆర్ఎస్ హయాంలో అదే కల్వకుర్తి కింది 3 లక్షల 7 వేల ఎకరాలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. నెట్టంపాడు కింద ఆనాడు 2700 ఎకరాలకు నీరు ఇవ్వగా... మహబూబ్‌నగర్ జిల్లాలో తారు 6 లక్షల 50 వేల ఎకరాలకు నీళ్లిచ్చామన్నారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో ఒక్క మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదని, కానీ తాము పాలమూరు జిల్లాలో 5 మెడికల్ కాలేజీలు, టీచింగ్ ఆసుపత్రులు ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పౌరుషాన్ని పాలనలో చూపించాలి కానీ ప్రతిపక్షాన్ని ఇష్టం వచ్చినట్లు తిట్టడంలో కాదని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. కేసీఆర్ కిట్లు తీసుకు వస్తే... రేవంత్ రెడ్డి తిట్లు తిట్టడంలో పోటీ పడుతున్నారని విమర్శించారు. తన ఎత్తు గురించి రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని.. తానూ ఆయన ఎత్తు గురించి మాట్లాడగలనని హెచ్చరించారు.

# కాంగ్రెస్ సీఈసీ కీలక భేటీ..

## లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాపై కసరత్తు

**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
దిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (%జజుజ%) తొలిసారి సమావేశమైంది. దిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ భేటీ ప్రారంభమైంది. ఈ సమావేశానికి కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్, శశిథరూర్, అంబికా సోనీ, సింగ్ దేవ్‌తో పాటు సీఈసీ సభ్యులు హాజరు కాగా.. రాహుల్ గాంధీ వర్చువల్‌గా పాల్గొన్నారు.సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీచేసే నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల తొలి జాబితాపై కసరత్తు చేస్తున్నారు. తొలుత దిల్లీ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తెలంగాణ, లక్షద్వీప్, కేరళ, మేఘాలయ, త్రిపుర, సిక్కిం, మణిపుర్‌తో పాటు మొత్తం 10 రాష్ట్రాల్లో 60 సీట్లలో అభ్యర్థుల ఎంపికపై చర్చించనున్నట్లు సమాచారం. ఇప్పటికే భాజపా 195 మందితో అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతుండగా.. కాంగ్రెస్ ఇంతవరకు ఒక్క అభ్యర్థిని కూడా ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించేందుకు వీలైనంత త్వరగా అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ తొలి జాబితాలో తెలంగాణలో 8 నుంచి 10 నియోజకవర్గాలకు పేర్లను ప్రకటించే అవకాశం ఉందని రాష్ట్ర నేతలు అంచనా వేస్తున్నారు.

# ఉజ్వల పథకం కింద రూ.300 గ్యాస్ రాయితీని మరో ఏడాది పొడిగించిన కేంద్రం

**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
ఉజ్వల పథకం గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ పథకం కింద గ్యాస్ సిలిండర్లకు రాయితీ గడువును మరో ఏడాది పొడిగించింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన (%ూవీఖ్%) కింద కేంద్ర ప్రభుత్వం 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ గ్యాస్‌పై రూ.300 రాయితీని అందిస్తోంది. ఈ గడువును మార్చి 31, 2025 వరకు పొడిగించినట్లు కేంద్రం తెలిపింది. %ూవీఖ్% లబ్ధిదారులకు సంవత్సరానికి 12 రీఫిల్ సిలిండర్ రాయితీ కింద రూ.300 అందిస్తున్నారు. అక్టోబర్ నెలలో ఎల్పీజీ సిలిండర్‌పై సబ్సిడీ మొత్తాన్ని రూ.200 నుంచి రూ.300కు పెంచింది. సబ్సిడీ మొత్తాన్ని అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని ప్రభుత్వం తెలిపింది.

# రేవంత్ రెడ్డి పాలన చూశాక ప్రజలకు గాడిద ఎవరో... గుర్రం ఎవరో తెలుస్తుంది



**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
ఎవరు గాడిదో... ఎవరు గుర్రమో... ప్రజలకు కూడా తెలియాలి... అందుకే రేవంత్ రెడ్డి అయిదేళ్లు పాలన చేయాలి... అప్పుడు రేవంత్ రెడ్డి పాలన చూశాక కేసీఆర్ గొప్పతనం తెలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నాడు ఆంధ్రా పాలన మీద 2001లో కేసీఆర్ కరీంనగర్‌లో సింహగర్జన పెట్టారని... ఇప్పుడు అబద్ధాల రేవంత్ రెడ్డి పాలన మీద మార్చి 12న మరోసారి కదనభేరి మోగించేందుకు పార్టీ సిద్ధమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిన్న మహబూబ్ నగర్ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు ఆశ్చర్యాన్ని కలిగించాయన్నారు. జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నానని... కడుపు చింపుతానని... పేగులు మెడలో వేసుకొని తిరుగుతానని... మా ప్రభుత్వాన్ని ఏమైనా చేస్తే మానవ బాంబులా మారుతానని అంటున్నారని.. ఇవేం మాటలు? అని కేటీఆర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఎక్కడైనా జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతారా... జేబు దొంగలే అలా తిరుగుతారని ఎద్దేవా చేశారు. అంతకుముందేమో సచివాలయానికి వచ్చి లంకె బిందెలు దొరుకుతాయని భావించానని అన్నాడని గుర్తు చేశారు. ఈ లంకె బిందెలు ఏంది? జేబులో కత్తెర ఏంది? అని చురక అంటించారు. ముఖ్యమంత్రి మాట్లాడే మాటలా ఇవి... ఈ ఫ్రస్ట్రేషన్ ఎందుకు? ఆవేశంతో ఊగిపోవడం ఎందుకు? అని మండిపడ్డారు. తాను రేవంత్ రెడ్డికి ఓ విజ్ఞప్తి చేస్తున్నానని... కాంగ్రెస్ పార్టీలో నీ పక్కనే బాంబులు ఉన్నాయని... నల్గొండ బాంబు, ఖమ్మం బాంబులు మీ ప్రభుత్వం మీద చేసేదంతా వారే చేస్తారన్నారు. రేవంత్ రెడ్డి అయిదేళ్లు అధికారంలో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని... 420 హామీలు అమలు చేయాలని కోరుకుంటున్నామన్నారు. వెలుగు... చీకటి రెండూ చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని... అలాగే కేసీఆర్, రేవంత్ రెడ్డిని చూశాక కేసీఆర్ విలువ ప్రజలకు తెలుస్తుందన్నారు. అందుకే రేవంత్ రెడ్డి బీపీ పెంచుకొని ఆగమాగం కావొద్దని.. మా నుంచి ఎలాంటి ప్రమాదం ఉండదని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డికి ప్రమాదం అంటూ ఉన్నదంటే ఆయన పక్కన కూర్చున్న కాంగ్రెస్ నేతల నుంచే అన్నారు. బీపీ గోలీలు వేసుకొని హాయిగా ఉండాలని వ్యాఖ్యానించారు.గుజరాత్ మోడల్ గొప్పదని రేవంత్ రెడ్డి అంటున్నారని... నోటికి వచ్చినట్లు అబద్ధాలు చెప్పడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. మన రైతుబంధును కాపీ కొట్టి కేంద్రం పీఎం కిసాన్ పెట్టిందని తెలిపారు. అలాగే మిషన్ కాకతీయను కాపీ కొట్టి అమృత్ సరోవర్ అని పేరు పెట్టారన్నారు. రాహుల్ గాంధీయేమో గుజరాత్ మోడల్ అట్టర్ ప్లాప్ అంటే.. రేవంత్ రెడ్డేమో గుజరాత్ మోడల్ కావాలని అంటున్నారని ధ్వజమెత్తారు. మూడు నెలల్లోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాభిమానం కోల్పోయిందన్నారు.

# ధరణి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత...

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం: మంత్రి పొంగులేటి

**%6 రోజుల్లోనే 76వేలకు పైగా ధరణి సమస్యలను పరిష్కరించినట్లు వెల్లడి**

**బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను హడావుడిగా తీసుకువచ్చిందని ఆరోపణ**

**మార్చి 1వ తేదీ నుంచి దరఖాస్తుల స్పెషల్ డ్రైవ్ జరుగుతోందన్న మంత్రి**



**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
ధరణి సమస్యల పరిష్కారానికి తమ తమ ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌తో ధరణి సమస్యలు ఒక్కొక్కటీ కొలిక్కి వస్తున్నాయన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 6 రోజుల్లోనే 76వేలకు పైగా ధరణి సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో లక్షలాది సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని మండిపడ్డారు.వీటిని పరిష్కరించేందుకు ఎమ్మార్వో స్థాయి అధికారులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను హడావుడిగా తీసుకువచ్చిందని ఆరోపించారు. అందుకే ధరణికి సంబంధించి దాదాపు రెండున్నర లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. మార్చి 1వ తేదీ నుంచి ఈ దరఖాస్తుల స్పెషల్ డ్రైవ్ జరుగుతోందన్నారు.

# గవర్నర్ కోటా ఎంఎల్‌సిల నియామకం రద్దు

**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
ఈ మేరకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామక వివాదంపై దాఖలైన పిటిషన్‌లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటిల ధర్మాసనం గురువారం కీలక తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 (5) ప్రకారం.. కేబినెట్ సాయం, సలహా మేర కు గవర్నర్ వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొంది. కేబినెట్ సిఫార్సు చేసిన వ్యక్తుల అర్హత, అనర్హత అంశాలను పరిశీలించడానికి గవర్నర్‌కు అధికారం ఉంటుందని.. కావాలంటే అవసరమైన పత్రాలు, సమాచారం కోరవచ్చని తెలిపింది. కేబినెట్ సిఫార్సులను పునఃపరిశీలనకు పంపే అధికారం కూడా ఉంటుందని స్పష్టం చేసింది.

వాస్తవానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం కోర్టుకు గవర్నర్ జవాబుదారీ కాదని.. గవర్నర్‌కు కోర్టులు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేవని పేర్కొంది. కానీ హైకోర్టుకు న్యాయసమీక్ష చేసే అధికారం ఉంటుందని వివరించింది. 'గవర్నర్ కోటా' పిటిషన్లపై వాదనలను పరిశీలించాక.. రాజ్యాంగంలోని నిబంధనలకు అనుగుణంగా తగిన చర్య తీసుకోవాలని భావించి తీర్పునిస్తున్నట్టు తెలిపింది. ఇక అప్పటి కేబినెట్ సిఫార్సులను అమలు చేయాలన్న పిటిషనర్ల డిమాండ్‌పై చర్చ అనవసరమని.. వారు గవర్నర్ తిరస్కరించడాన్ని మాత్రమే సవాలు చేశారని పేర్కొంది.

2023 జూలై 31న భేటీ అయిన గత ప్రభుత్వ కేబినెట్ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణల పేర్లను గవర్నర్‌కు సిఫార్సు చేసింది. గవర్నర్ ఈ సిఫార్సులను తిరస్కరిస్తూ సెప్టెంబర్ 19న ఆదేశాలు జారీ చేశారు. దీంతో గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.

ఈ పిటిషన్లు విచారణలో ఉండగానే.. కొత్త ప్రభుత్వ కేబినెట్ సిఫార్సు మేరకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, జర్నలిస్టు ఆమెర్ అలీఖాన్‌ల నియామకానికి గవర్నర్ ఆమోదం తెలిపారు. ఈ ఏడాది జనవరి 27న ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఈ నియామకాలను కూడా శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో సవాల్ చేశారు. రెండు అంశాలపైనా హైకోర్టు సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. కోదండరామ్, ఆమెర్ అలీఖాన్‌ను ప్రధాన పిటిషన్‌లో ఇంప్లీడ్ చేసింది. వారి ప్రమాణస్వీకారంపైనా స్టే ఇచ్చింది. తాజాగా తీర్పు వెలువరించింది.

"దాసోజు శ్రవణ్ రాజకీయ నాయకుడన్న కారణంగా గవర్నర్ తిరస్కరించారు. తర్వాత నియామకమయ్యే వారు కూడా రాజకీయాలకు సంబంధం లేకుండా ఉండాలి. కానీ నియామకమైన వారు కూడా రాజకీయ నాయకులే. అందులో ఒకరు రాజకీయ పార్టీనే నడిపిస్తున్నారు" అని హైకోర్టులో దాసోజు శ్రవణ్ తరఫున సీనియర్ న్యాయవాది ఆదిత్యా సోంధీ వాదనలు వినిపించారు. "గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వ అర్హతలకు.. పిటిషనర్ల నామినేషన్ తిరస్కరణ కారణాలకు పొంతన లేదు. మంత్రివర్గ సిఫార్సులను తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదు. దీనిపై సుప్రీంకోర్టు తీర్పులున్నాయి.

గవర్నర్‌కు అభ్యంతరం ఉంటే పునః పరిశీలన కోసం వెనక్కి పంపవచ్చు. గవర్నర్ తిరస్కరణ కారణంగా హక్కును కోల్పోయిన పిటిషనర్‌కు కోర్టును ఆశ్రయించే అర్హత ఉంటుంది. శ్రవణ్, సత్యనారాయణల పేర్లను నెలల తరబడి పరిశీలించిన గవర్నర్.. కోదండరామ్, ఆమెర్ అలీఖాన్‌ల పేర్లను మాత్రం కొత్త కేబినెట్ సిఫార్సు చేసిన వెంటనే ఆమోదించింది" అని వివరించారు. కుర్ర సత్యనారాయణ తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. "మంత్రి మండలి సిఫార్సులను గవర్నర్ వెనక్కి పంపడానికి, తిరస్కరించడానికి తేడా లేదని పేర్కొనడం సరికాదు. ప్రభుత్వం సిఫార్సు చేసిన అభ్యర్థులపై గవర్నర్‌గా సంతృప్తి చెందడం వేరు.. ఓ వ్యక్తిగా సంతృప్తి చెందడం వేరు. పిటిషనర్ల పేర్లను గవర్నర్ వ్యక్తిగతంగా తిరస్కరించినట్టు కనిపిస్తోంది" అని పేర్కొన్నారు.

### ప్రభుత్వ సిఫార్సు మేరకే నియామకం..

పభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) వాదనలు వినిపిస్తూ.. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఇద్దరి పేర్లను ఎమ్మెల్సీలుగా సూచిస్తూ జనవరి 24న ప్రభుత్వం సిఫార్సు చేసిందని, దాన్ని పరిశీలించాకే గవర్నర్ ఆమోదించారని వివరించారు. ఇదంతా చట్టప్రకారమే జరిగిందన్నారు. గతంలో ప్రభుత్వం చేసిన సిఫార్సులను పక్కకుపెట్టే అధికారం ఇప్పుడున్న సర్కార్‌కు ఉంటుందని స్పష్టం చేశారు.

# ఈ నెల 18వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు

**హాల్ టికెట్లు అందుబాటులో పెట్టిన అధికారులు**

**ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహణ**



**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్: రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఎస్ఎస్‌సి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. పదవ తరగతి రెగ్యులర్, ప్రైవేటు, ఓఎస్ఎస్‌సి, ఒకేషన్ విద్యార్థులు తమ హాల్ టికెట్లు పొందేందుకు జిల్లా పేరు, స్కూల్ పేరు, పుట్టిన తేదిని నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీవరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు.ఈ ఏడాది ఫిజికల్ సైన్సు, బయాలజీ రెండు సబ్జెక్టులకు వేరు వేరుగా పరీక్షలు జరగనున్నాయి. ఈ రెండు సబ్జెక్టులకు ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు మాత్రమే పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5.08 లక్షలమంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 2676 పరీక్ష కేంద్రాలు అధికారులు ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతరత్రా పేపర్లకు అనుమతి నిరాకరంచారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 5.08 లక్షల మంది విద్యార్థులు రాయనున్నారు.

# ఏ క్షణమైనా కాంగ్రెస్ జాబితా

**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
/హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ గురువారం సాయంత్రం తొలిసారి సమావేశమైంది. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ భేటీ ప్రారంభమైంది. ఈ సమావేశానికి కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్, శశిధరూర్, అంబికా సోనీ, సింగ్ దేవ్‌తో పాటు సీఈసీ సభ్యులు హాజరు కాగా రాహుల్ గాంధీ వర్చువల్ గా పాల్గొన్నారు. ముందు గా ఢిల్లీ, ఛత్తీస్‌ఘఢ్, కర్ణాటక, తెలంగాణ, లక్షద్వీప్, కేరళ, మేఘాలయ, త్రిపుర, సిక్కిం, మణిపూర్‌తో పాటు మొత్తం 10 రాష్ట్రాల్లో 60 సీట్లలో అభ్యర్థుల ఎంపికపై చర్చించనున్నట్లుగా సమాచారం. అయితే




తెలంగాణకు సంబంధించి రాత్రి 9 గంటల తరువాత ఈ కమిటీ చర్చించినట్టుగా తెలిసింది. అయితే తొలి జాబితాలో తెలంగాణలోని 8 నుంచి 10 నియోజకవర్గాలకు పేర్లను ప్రకటించే అవకాశం ఉందని రాష్ట్ర నేతలు పేర్కొంటుండగా, అయితే నేడు వారి పేర్లను వెల్లడించే అవకాశం ఉన్నట్టుగా టిపిసిసి నాయకులు పేర్కొంటున్నారు.
ఎపి, తెలంగాణలకు సంబంధించి 8,9 వ తేదీల్లో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం ఉంటుందని కాం గ్రెస్ వర్గాలు పేర్కొంటుండగా ఏకాభిప్రాయం ఉన్న కొన్ని స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ఎప్పుడైనా వెల్లడించే అవకాశం ఉంటుందని టిపిసిసి పేర్కొంటోంది. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు హాజరయ్యారు. ఇప్పటికే భాజపా 195 మందితో అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతుండగా కాంగ్రెస్ ఇంతవరకు ఒక్క అభ్యర్థిని కూడా ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించేందుకు వీలైనంత త్వరగా అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి

# హైకోర్టు తీర్పును స్వాగతించిన దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ

**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
%గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయంలో హైకోర్టు తీర్పును బీఆర్ఎస్ స్వాగతించింది. హైకోర్టు తీర్పు అనంతరం బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ... రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) ప్రకారం తమకు కూడా ఎమ్మెల్సీలుగా అర్హతలు ఉన్నాయని తెలిపారు. వెనుకబడిన వర్గాల వారికి చట్టసభలకు అవకాశం అరుదుగా వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన




విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌ను హైకోర్టు కొట్టివేసింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ కేబినెట్ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను నామినేట్ చేశారు. ఈ తీర్మానానికి గవర్నర్ ఆమోదం తెలిపారు. అయితే కేబినెట్‌కు ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసే హక్కు ఉందని... గవర్నర్ తమ విషయంలో పరిధి దాటి వ్యవహరించారని దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణలను హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌ను కొట్టివేసింది.

# ఎల్ఆర్ఎస్ కు వ్యతిరేకంగా
# నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

**హుజూర్ నగర్ మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్ఆర్ఎస్‌పై (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) తెలంగాణ సర్కార్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బి.అర్.యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సైదిరెడ్డి పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు హుజూర్నగర్ పట్టణంలో పోరుబాటకు దిగారు. ఎన్నికల ముందు ప్రస్తుత మంత్రిమండలిలో ఉన్న మంత్రులు నో ఎల్ఆర్ఎస్ – నో టి ఆర్ ఎస్ అని చెప్పి ఇప్పుడు డబ్బులు వసూలు చేస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా 2020 నుంచి




పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి మార్చి 31లోగా క్రమబద్ధీకరణ ప్రక్రియను ముగించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలపై ఆర్థిక భారం మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ను వాడుకుంటోందని అన్నారు. బి.ఆర్.యస్ పథకాలకు ఆనాడు అడ్డు చెప్పి ఇప్పుడు అవే పనులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేతలు నాలుక మడతేశారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని ఉచితంగా భూములు క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారని గుర్తు చేశారు. ఈ ధర్నాలో నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు, జెడ్‌పిటిసి,ఎంపిపి లు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# డేట్, టైమ్ ఫిక్స్ చేయ్...

### కరీంనగర్‌పై చర్చిద్దామా? . ప్లేస్ మాత్రం అదే: బండి సంజయ్ కు కేటీఆర్ సవాల్
### కరీంనగర్‌కు ఎవరేం చేశారో చర్చిద్దామన్న కేటీఆర్

**మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
బండి సంజయ్... కరీంనగర్‌కు ఎవరేం చేశారో చర్చిద్దామా? డేట్, టైమ్ నువ్వే ఫిక్స్ చెయ్... ప్లేస్ మాత్రం కరీంనగర్ కమాన్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. వినోద్ కుమార్ చర్చకు వస్తారని తెలిపారు. ఈ రోజు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బండి సంజయ్ ఎప్పుడు ఏం మాట్లాడుతారో తెలియదని విమర్శించారు. కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి బండి సంజయ్ అడ్డిమారి గుడ్డిదెబ్బగా గెలిచారన్నారు. ఎంపీగా ఈ నియోజకవర్గానికి ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. గత పదేళ్లలో అయిదేళ్ళు వినోద్ కుమార్, మరో అయిదేళ్లు బండి సంజయ్ ఎంపీలుగా ఉన్నారని... ఎవరేం చేశారో చూద్దామా? అని నిలదీశారు. అయిదేళ్లుగా ఇక్కడకు వచ్చి కేసీఆర్‌ను తిట్టుడు... సొల్లు వాగుడు తప్ప ఏమైనా చేశావా? అన్నారు. సైకో లెక్క అరుస్తాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓ ఎంపీగా ప్రధాని మోదీని పట్టుకొని ఈ పని చేశానని చెప్పే దమ్ముందా? అన్నారు. అలాంటప్పుడు నీకు ఓటు ఎందుకు వేయాలో చెప్పాలన్నారు. కరీంనగర్ కమాన్ వద్దనే నీ బతుకేందో తెలియాలన్నారు.

### పొన్నం ప్రభాకర్‌పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన వ్యాఖ్యలకు బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నీ ఎంపీ నిధులు కూడా ఖర్చు పెట్టే చేతకాని నువ్వు అసలు ఎంపీగా ఎందుకు ఉండాలి? అని ప్రశ్నించారు. దేశం కోసం... ధర్మం కోసం అని చెబుతుంటాడని... అలా అయితే మఠం పెట్టుకోవాలని సూచించారు. ఎంతోమంది స్వామీజీలు అన్నీ త్యజించి పని చేస్తున్నారని గుర్తు చేశారు. కానీ బండి సంజయ్‌కి మాత్రం అలా వద్దట.. అధికారం కావాలి... అధికారం ద్వారా వచ్చే లాభాలు కావాలని విమర్శించారు. పైగా అడిగితే ధర్మం కోసమని పోజులు అని మండిపడ్డారు. మన కోసం పని చేసే వినోదన్నను ఈ ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.



ఈ సంవత్సరమంతా ఎన్నికలే ఉంటాయని... పార్లమెంట్ ఎన్నికలు పూర్తవగానే పంచాయతీ, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్ ఎన్నికలు ఉంటాయని గుర్తు చేశారు. అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత మాదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మీ అందరికీ మాట ఇస్తున్నానన్నారు. ఈ రోజు అభ్యర్థుల గెలుపు కోసం ఎలాగైతే కష్టపడి తిరుగుతున్నారో... రేపు మీ కోసం అంతకంటే ఎక్కువగా పని చేసే బాధ్యత మాదే అన్నారు. ఊరూరా తిరిగే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు.

# సమీక్షిస్తున్న రంజాన్ పండుగ





హనుమకొండ, మార్చి7(జర్నలిస్ట్ వార్త): రంజాన్ పండుగ సమీపిస్తున్న సందర్భంగా ముస్లిం మత పెద్దలతో గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సహచర ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులుగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

### - అభినందించిన పాఠశాల ఉపాధ్యాయులు

**వర్ధన్నపేట, మార్చి8(జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు పాఠశాలలో వారు నేర్చుకున్న పాఠాలు తోటి విద్యార్థులకు బోధించడం గమనార్హం. డీఈఓ, ఎంఈఓ,హెచ్ ఎం, క్లాస్ టీచర్లుగా విద్యార్థులుగా వ్యవహరించడం వారి ప్రతిభకు ఇదొక నిదర్శనం. ఉపాధ్యాయ విధివిధానాలకు తీసిపోకుండా



ఆ విద్యార్థులు వారి ప్రతిభను కనబరిచారు. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ పాఠాలు బోధిస్తుంటే, పాఠశాల ఉపాధ్యాయులే ఆశ్చర్యపరులయ్యారు. తమ విద్యార్థులు ఇలాంటి టాలెంట్ ఉందన్న సంగతి స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు తెలిసిందన్నారు. చెప్పిన పాఠాలు జ్ఞాపకం చేసుకుని తోటి విద్యార్థులకు బోధించే విధంగా విద్యార్థులు ఎదగడం ఉపాధ్యాయులకు ఓ గుర్తింపు అన్నారు. ఇలాంటి విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. తమ వంతు బాధ్యతలను నెరవేర్చే విధంగా బాలలు వారి ప్రతిభను కనబరిచిన సందర్భంగా ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు ఉపాధ్యాయురాలు లలిత బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు..

# విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

### - జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మాలోత్ సారయ్య




రాయపర్తి, మార్చి 7(జర్నలిస్ట్ వార్త): పదవ తరగతి విద్యార్థులు రాబోయే పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మాలోత్ సారయ్య అన్నారు. గురువారం రాయపర్తి మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, మండల విద్యా వనరుల కేంద్రాన్ని సారయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ, తరగతి విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థులు అందరూ 10 బై 10 జిపిఎస్ సాధించాలన్నారు. పరీక్షలపై ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షలు విజయవంతంగా రాయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డిసిఈబి సెక్రెటరీ గారె కృష్ణమూర్తి, ఇంచార్జి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్, ఏవిఆర్ చార్యులు, ఉపాధ్యాయులు, శ్రీనివాస్, యాకయ్య, ఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ అవార్డ్ అందుకున్న అగన్వాడి టీచర్

రాయపర్తి, మార్చి7(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం మొరిపిరాల అంగన్వాడి కేంద్రం ఉపాధ్యాయిని పద్మ, కాట్రపెల్లి సర్కిల్ 2 హెల్పర్ కనకతారకు ఉత్తమ అవార్డు లభించింది. గురువారం క్లస్టర్ 2 అంగడివాడీ కేంద్రంలో మాతా శిశు సంక్షేమమే లక్ష్యంగా ఉత్తమ సేవలు అందించినందుకు పద్మకు వర్ధన్నపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సిడిపిఓ డేబోరి అవార్డ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ




అంకితభావంతో పనిచేసే ప్రతి ఒక్కరు ప్రజల మనసులో ఉండి పోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మాధవి లత తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి నాడు జాగరణ ఎందుకు..?



**మార్చి8(జర్నలిస్ట్ వార్త):** ప్రకృతిలో నిద్రాణమైయున్న శివశక్తిని, శివపూజా భజన లీలా శ్రవణా దులతో మేల్కొలిపి, తాను శివుడై, సర్వం శివస్వరూపంగా భావించి, దర్శించడమే నిజమైన జాగరణం. ఇలా చేస్తే, శివపూజలో సాయు జ్యం, శివభజనలో సామీప్యం, శివభక్తులతో కూడి, శివ విషయాలు ప్రసంగించుటలో సలోక్యం, శివధ్యానంలో సారూప్యం సిద్ధిస్తాయని సాక్షాత్తు జగద్గురువు ఆదిశంకరాచార్యుల వారు చెప్పారు.

ఖాళీ కడుపులో విషతుల్యమైన ఆమ్లాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. అవి శరీర ఆరోగ్యంపై ప్రభావం చూపకుండా ఉండేందుకే ఉపవాసం చేసిన వారికి జాగరణ కూడా ముఖ్యవిధిగా ఏర్పర్చారు. మర్నాడు మితాహారంతో ఉపవాసం విరమించిన తరువాత కూడా వెంటనే నిద్రకు ఉపక్రమించకూడదు. రెండు పొద్దులైనా ఆహారం తీసుకోవాలి. జాగరణం అంటే మన గురించి మనం మేలుకుని ఉండడం.

జాగరణను సంపూర్ణ ఆరోగ్యవంతులే చేయాలి. జాగరణ మర్నాడు విశ్రాంతిగా గడపడం అవసరం. ఉపవాస, జాగరణలు చేసేవారు మితిమీరిన శారీరక శ్రమకు దూరంగా ఉండాలి. డ్రైవింగ్ వంటి ఏకాగ్రత అత్యవసరం అయ్యే పనులకు విశ్రాంతి తరువాతే ఉపక్రమించండి. జాగరణ సమయంలో మానసిక ఉద్వేగాలను పెంచే వినోద కార్యక్రమాలకు దూరంగా ఉండాలి.

## సీఎం సలహాదారు వేమ్‌తో మాజీమంత్రి మల్లారెడ్డి భేటీ

### అల్లుడి భవనాల కూల్చివేత క్రమంలో అత్యవసర భేటీ

మేడ్చల్, **మార్చి8(జర్నలిస్ట్ వార్త):** : ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం సీఎం సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డితో సమావేశం అయ్యారు.దుండిగల్ చెరువును ఆక్రమించి నిర్మించిన..మర్రి రాజశేఖర్ రెడ్డికి చెందిన భవనాలను ఉదయం నుంచి కూల్చి వేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు..అక్రమ కూల్చివేతలని అంటున్నారు. వారం రోజుల కిందటే నోటీసులు ఇచ్చారని కనీసం తమకు సమాధానం చెప్పే అవకాశం కూడా ఇవ్వలేదని అంటున్నారు. ఈ క్రమంలో వారు సీఎం సలహాదారుతో సమావేశం కావడం రాజకీయవర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఉదయం నుంచి కూల్చివేతలు కొనసాగుతున్నాయి. మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కాలేజీకి చెందిన భవనాలను అధికారులు కూల్చివేశారు. దుండిగల్‌లోని చిన్న దామరచెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో మర్రి రాజశేఖర్‌రెడ్డికి సంబంధించిన ఐఏఆర్ఈ, ఎంఎల్ఆర్ఐటీఎం కళాశాలలకు చెందిన రెండు శాశ్వత భవనాలు, 6 తాత్కాలిక షెడ్లు కూల్చివేశారు.

మొత్తం 8.24 ఎకరాల చెరువు (ఎఫ్‌టీఎల్ బఫర్



జోన్) ఆక్రమించి పార్కింగ్ కోసం రోడ్లు, భవనాలు నిర్మించినట్లు నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులు గతంలో గుర్తించారు. ఈ మేరకు వారం రోజుల క్రితం యాజమాన్యానికి నోటీసులిచ్చారు. తాజాగా మేడ్చల్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. మల్లారెడ్డికి ఇటీవలే అధికారులు షాక్ ఇచ్చారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో హెచ్ఎండీఏ లే అవుట్ లో ఆయనకు సంబంధించిన కాలేజీ రోడ్డును అధికారులు తొలగించారు. ఇక్కడ 2,500 గజాల భూమిని ఆయన ఆక్రమించి రోడ్డు నిర్మించారని ఆరోపణలున్నాయి. దీనిపై గతంలో మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేశారు. తన కాలేజీ కోసమే అప్పట్లో మల్లారెడ్డి రోడ్డు వేసుకున్నారని ఆరోపించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వొచ్చిన తర్వాత ఈ భూమి అంశం మరోసారి తెరపైకి వొచ్చింది. ఈ మేరకు హెచ్ఎండీఏ స్థలం ఆక్రమణలపై కలెక్టర్ దృష్టి సారించారు. అక్రమంగా వేసిన రోడ్డును తొలగించాలని అధికారులను ఆదేశించగా.. ఆ రోడ్డును అధికారులు తొలగించారు. అయితే, అధికారులు తన కాలేజీ రోడ్డును తొలగించడంపై మాజీ మంత్రి మల్లారెడ్డి స్పందించారు. తనను కావాలనే కొంత మంది టార్గెట్ చేశారని అన్నారు.

ప్రభుత్వం తనపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేపడుతుందని మండిపడ్డారు. హెచ్ఎండీఏ అధికారుల అనుమతి తీసుకునే అప్పట్లో కాలేజీకి రోడ్డు వేశామని స్పష్టం చేశారు. 2,500 గజాల స్థలానికి ప్రత్యామ్నాయంగా స్థలాన్ని మున్సిపాలిటీకి ఇచ్చామని చెప్పారు. మరో వైపు మర్రి రాజశేఖర్ రెడ్డిపై పోలీసులు కేసులు పెట్టారు. ఉచిత ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలంటూ.. బీఆర్ఎస్ శ్రేణులు అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అక్కడ పోలీసు అధికారితో వాగ్వాదానికి దిగడంతో ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించారంటూ..ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. అల్వాల్ సర్కిల్ కార్యాలయానికి ఉదయాన్నే వెళ్లిన డీసీ శ్రీనివాస్ రెడ్డిని ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విధులకు ఆటకం కలుగజేయడంతో పాటు పౌరుష పదజాలాలతో మాట్లాడటంతో పాటు దూషించారని డీసీ ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ఎన్డీయేలో తెదేపా చేరిక ఖాయమైనట్లే!

**సీట్ల సర్దుబాటుపై నేడూ చర్చ!**
**అమిత్‌షా, నడ్డాలతో చంద్రబాబు, పవన్ భేటీఅర్ధరాత్రి వరకు కొనసాగిన సమాలోచనలు**
**సీట్ల కేటాయింపుపై రాని స్పష్టత**



**మార్చి8(జర్నలిస్ట్ వార్త):** దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల పొత్తుపై భాజపా అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా గురువారం రాత్రి తెదేపా అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌లతో చర్చలు జరిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 400కి పైగా సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాత మిత్రపక్షాలన్నింటినీ తిరిగి దగ్గర చేర్చుకొనే ప్రయత్నం చేస్తున్నారు. దీనిలో భాగంగా తెదేపాను తిరిగి ఎన్డీయేలో చేర్చుకొనే అంశంపై కసరత్తు జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బిహార్‌లో నీతీష్‌కుమార్, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆర్ఎల్‌డీ నేత జయంత్‌చౌధరిని ఎన్డీయేలో చేర్చుకున్న భాజపా అగ్రనేతలు రేపోమాపో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీనీ చేర్చుకోవడానికి రంగం సిద్ధం చేశారు. అదే క్రమంలో తెదేపాతో జట్టు కట్టడానికీ సమాయత్తమయ్యారు. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో సీట్ల సర్దుబాటుపై అమిత్‌షా, నడ్డాలు గురువారం రాత్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లతో చర్చించినట్లు సమాచారం. గురువారం రాత్రి 10.30 నుంచి 12.10 వరకు వీరి చర్చలు కొనసాగాయి.

## ఈ నెల 17న చిలకలూరిపేటలో బహిరంగ సభ

**అదే సభలో ఉమ్మడి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకం విడుదల**
**టీడీపీ, జనసేన సోషల్ మీడియా కార్యకర్తలను పోలీసులు బెదిరిస్తున్నారని అచ్చెన్న మండిపాటు**
**10 లక్షల మందితో సభ నిర్వహిస్తున్నట్టు వెల్లడి**



**మార్చి8(జర్నలిస్ట్ వార్త):** ఈ నెల 17న గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహించనున్న టీడీపీ-జనసేన బహిరంగ సభకు ఆర్టీసీ బస్సులు ఇవ్వకుంటే ప్రస్తుతం ఉన్న అధికారులు ఆ తర్వాత భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలుగుదేశం ఆర్టీసీ ఎండీని పార్టీ ఏపీ చీఫ్ అచ్చెన్నాయుడు హెచ్చరించారు. గతంలో ఎప్పుడూ అధికారులు ఇలా వ్యవహరించలేదని, ఏ పార్టీ సభలు పెట్టుకున్నా బస్సులు ఇచ్చేవారని తెలిపారు. ఇప్పుడు మాత్రం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలకలూరిపేట సభలో 'సూపర్ సిక్స్', ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేస్తామని తెలిపారు.

రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొనే టీడీపీ, జనసేన దగ్గరైనట్టు చెప్పారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత ఇరు పార్టీల మధ్య గొడవలు పెట్టాలని చూసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు అనుకూలంగా సోషల్ మీడియాలో పనిచేసే వారిపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ సభతో చరిత్ర సృష్టించబోతున్నామని, 10 లక్షల మందితో సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. టీడీపీ, జనసేన సోషల్ మీడియా కార్యకర్తలను పోలీసులు బెదిరిస్తే వెంటనే 73062 99999కు ఫోన్ చేస్తే టీడీపీ వెంటనే స్పందిస్తుందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో... ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు

**రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం టిటిడి తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన టిటిడి అర్చక బృందం**
**శివార్చనను ప్రారంభించిన మంత్రి పొన్నం**

సిరిసిల్ల,(మార్చి8(జర్నలిస్ట్ వార్త): : వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి.ఈ ఉత్సవాల కోసం అన్ని శాఖల సిబ్బంది తమకు కేటాయించబడిన విధుల్లో చేరి సేవలను అందిస్తున్నారు.ఈ ఉత్సవాల కోసం ఆలయంతో పాటు వేములవాడను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం రాత్రి వరకు 50 వేలకు పైగా భక్తులు వేములవాడకు చేరుకున్నారు.శుక్రవారం ఉదయం నుండి రాత్రి వరకు మరో రెండు లక్షల భక్తులు వేములవాడకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.శుక్రవారం ఉదయం నుండి రాజన్నగుడికి భక్తుల రాక అధికంగా ఉంటుందని ఆలయంలో తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ ఏర్పాట్లన్నింటిని వేములవాడ ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,ఎస్పీ అఖిల్ మహాజన్‌లు గురువారం పరిశీలించారు.

గురువారం సాయంత్రం రాష్ట్ర రవాణశాఖ ,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వేములవాడకు చేరుకుని,ఆది శ్రీనివాస్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ తరపున శ్రీ రాజరాజేశ్వరస్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.అనంతరం టిటిడి అర్చక బృందం వేములవాడకు చేరుకుని శ్రీస్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.ఈ కార్యక్రమాలనంతరం గురువవారం రాత్రి నుండి శనివారం ఉదయం వరకు కొనసాగే రాష్ట్ర సాంస్కృతిక శాఖ,దేవస్థానం వారు సంయుక్తంగా రూ కోటికి పైగా వ్యయంతో



చేపట్టిన శివార్చన కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు ప్రారంభించారు. గురువారం అర్ధరాత్రి నుండి శు క్రవారం ఉదయం 3 గంటల వరకు స్థానిక భక్తులు శ్రీస్వామివారికి అభిషేకం చేసే అవకాశాన్ని కల్పించడంతో వేలాది స్థానికులు రాత్రి 11 గంటల నుండే క్యూలైన్లలో బారులు తీరారు.వీరంతా ఆలయంలోకి చేరుకుని శ్రీస్వామివారికి అభిషేకం చేసే సమయంలో మహామండపంలో రద్దీ అధికమైంది.ఈ రద్దీని క్రమబద్ధీకరించడానికి సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఈ ఉత్సవాలను ఎప్పటి కప్పుడు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,బందోబస్తును అఖిల్ మహాజన్ లతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు సిబ్బందికి తగిన సూచనలిస్తున్నారు.

ఇదిలా ఉండగా మహాశివరాత్రికి వేములవాడకు విచ్చేసే భక్తులకోసం ఆర్టీసి వారు వేములవాడబస్ స్టేషన్ నుండి దేవస్థానం వరకు 14 ఉచిత బస్సులను నిర్వహిస్తున్నారు.స్థానిక వాసవీ సేవాసమితి వారు,వేములవాడ అన్నదాన ట్రస్టువారు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా దానిని ఎమ్మెలే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.అంతేగాకుండా దేవస్థానం వారు ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహార శిబిరాన్ని సైతం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.దీనికి తోడుగా వేములవాడ అన్న దాన ట్రస్టు వారు మహాశివరాత్రి రోజున భక్తులకు ఉచితంగా అరటి పళ్లు,నీటి బాటిళ్లు పంపిణి చేయనున్నారు.

భక్తులు పవిత్ర స్నానాలు అచరించే ధర్మగుండాన్ని నీటితో నింపారు.

ఈ ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 15వందలకు పైగా పోలీస్ సిబ్బంది వివిధ స్థలాల్లో విధులను నిర్వహిస్తున్నారు.వైద్య ఆరోగ్య శాఖ వారు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు తీవ్ర సమస్యలతో బాధపడే వారిని ఏరియా ఆసుపత్రికి తరలించడానికి వీటుగా అంబులెన్సును సిద్ధంగా ఉంచారు.



# గవాస్కర్ రికార్డుకు చేరువలోకి వచ్చిన యశస్వి జైస్వాల్

సూపర్ ఫామ్ లో ఉన్న టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ మరో రికార్డుకు చేరువయ్యాడు.. టీమిండియా తరఫున ఓ టెస్టు సిరీస్ లో అత్యధిక పరుగుల రికార్డు ఇప్పటివరకు సునీల్ గవాస్కర్ పేరిట ఉంది. 1970-71లో వెస్టిండీస్ పర్యటనలో గవాస్కర్ 774 పరుగులు చేశాడు. ప్రస్తుతం జైస్వాల్ ఇంగ్లండ్ తో సిరీస్ లో 712 పరుగులు చేశాడు. గవాస్కర్ రికార్డుకు జైస్వాల్ మరో 62 పరుగుల దూరంలో ఉన్నాడు. ఈ జాబితాలో రెండో స్థానానికి చేరే క్రమంలో జైస్వాల్... మాజీ సారథి విరాట్ కోహ్లీ రికార్డును అధిగమించాడు. కోహ్లీ 2014-15 సీజన్ లో ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో 692 పరుగులు చేశాడు. ఇప్పుడీ జాబితాలో కోహ్లీని జైస్వాల్ వెనక్కి నెట్టాడు. ఇంగ్లండ్ తో సిరీస్ లో జైస్వాల్ రెండు డబుల్ సెంచరీలతో పరుగుల మోత మోగించిన సంగతి తెలిసిందే. ధర్మశాల టెస్టులో ఇవాళ టీమిండియా తొలి ఇన్నింగ్స్ లోనూ జైస్వాల్ దూకుడుగా ఆడి అర్ధసెంచరీ సాధించాడు. 58 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులతో 57 పరుగులు చేశాడు.


# జెర్సీ మార్చిన సన్ రైజర్స్...

ఐపీఎల్ విజేతల జాబితా చూస్తే సన్ రైజర్స్ హైదరాబాద్ పేరు కూడా కనిపిస్తుంది. కానీ గత కొన్ని సీజన్లుగా ఆ జట్టు నాసిరకం ఆటతో పాయింట్ల పట్టికలో దిగువకే పరిమితమవుతోంది. కొన్నిసార్లు దారుణమైన ఆటతీరుతో విమర్శకులకు పని కల్పిస్తుంటుంది. అయితే, ఈసారి ఆ చెడ్డపేరు తొలగించుకోవడానికి సన్ రైజర్స్ యాజమాన్యం భారీ మార్పులు చేపట్టింది.

ఇప్పటికే ఐడెన్ మార్క్రమ్ ను కెప్టెన్ గా తొలగించి, ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ ప్యాట్ కమిన్స్ కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. జట్టులోనూ భారీగా మార్పులు చేపట్టింది.

వేలంలో డబ్బు చాలా పొదుపుగా ఖర్చు పెడతారని పేరున్న సన్ రైజర్స్ యజమానులు ఈసారి వేలంలో విజృంభించి ఖర్చు పెట్టారు. కమిన్స్ ను రికార్డు స్థాయిలో రూ.20.50 కోట్లతో కొనుగోలు చేసి మిగతా ఫ్రాంచైజీలు నివ్వెరపోయేలా చేశారు. ఐపీఎల్ చరిత్రలోనే ఓ ఆటగాడికి పలికిన అత్యధిక ధర ఇదే.

ఇక అసలు విషయానికొస్తే... సన్ రైజర్స్ ఫ్రాంచైజీ జట్టు రూపురేఖలతో పాటే జెర్సీ కూడా మార్చేసింది. ఆరెంజ్ కలర్ ను మిస్ కాకుండా వాటిపై నల్లని చారలను జిగ్ జాగ్ గా ప్రింట్ చేసిన జెర్సీలను సన్



రైజర్స్ తన ఆటగాళ్లకు అందించింది. మార్చి 22న ఐపీఎల్ కొత్త సీజన్ ప్రారంభం కానుండగా, ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న సన్ రైజర్స్ ఆటగాళ్లు సరికొత్త జెర్సీలతో ఫొటో షూట్ కు హాజరయ్యారు.

ఈ జెర్సీ సన్ రైజర్స్ ఫ్రాంచైజీకి బాగా కలిసొచ్చిందనే చెప్పాలి. ఎలాగంటే... దక్షిణాఫ్రికాలో గత రెండు సీజన్లుగా ఎస్ఏ టీ20 లీగ్ ను గెలిచింది ఎవరో కాదు... సన్ రైజర్స్ జట్టే. ఐడెన్ మార్క్రమ్ నాయకత్వంలోని సన్ రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టు వరుసగా 2023, 2024 సీజన్లలో చాంపియన్ గా నిలిచింది.

ఆ టోర్నీలో ఏ డిజైన్ జెర్సీలు వాడారో, ఇప్పుడు ఐపీఎల్ లోనూ సన్ రైజర్స్ ఆటగాళ్లకు అదే డిజైన్ తో ఉన్న జెర్సీలు అందించారు. కలిసొచ్చిన జెర్సీతో అయినా ఐపీఎల్ లో తమ భాగ్యరేఖ మారుతుందేమోనని సన్ రైజర్స్ యాజమాన్యం ఆశిస్తోంది. ఐపీఎల్-2024లో సన్ రైజర్స్ తన తొలి మ్యాచ్ ను మార్చి 23న కోల్ కతా నైట్ రైడర్స్ తో ఆడనుంది.

# నా సినిమా ఫంక్షన్ కి ఆ హీరో అందుకే రాలేదు : విష్వక్సేన్

విష్వక్సేన్ కథానాయకుడిగా 'గామి' సినిమా రూపొందింది. ఈ సినిమాతో దర్శకుడిగా విద్యాధర్ పరిచయమవుతున్నాడు. శివరాత్రి సందర్భంగా ఈ సినిమా రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ లో విష్వక్ బిజీగా ఉన్నాడు. తాజాగా 'ఐ డ్రీమ్'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో విష్వక్ మాట్లాడుతూ, తన కెరియర్ విషయాలను పంచుకున్నాడు. " నేను హీరో కావడానికి గట్టిగా ప్రయత్నిస్తున్న సమయంలో, కొంతమంది నన్ను అవమానించారు. దాంతో నా సినిమాకి నేనే దర్శకుడిగా మారవలసి వచ్చింది. నా సినిమాకి నేనే నిర్మాతగానూ వ్యవహరించవలసి వచ్చింది. దూకుడుగా ఉండటం నా స్వభావం ... అది కొన్నిసార్లు అవసరం కూడా. లేదంటే వీడికి తుడుచుకుపోవడం అలవాటేనని అవతలవాళ్లు అనుకుంటారు .. మనకి కూడా తుడుచుకుపోవడం అలవాటైపోతుంది" అని అన్నాడు. " ఒకసారి నా సినిమా ఫంక్షన్ కి ఒక హీరోను పిలిచాను. ' ఇది ఫ్యామిలీ సినిమా కాదు .. పైగా బూతులు ఉన్నాయి .. నేను రావడం కరెక్టు కాదనుకుంటా' అని ఆ హీరో రాలేదు. దాంతో నేను వెంకటేశ్ గారిని కలిశాను . నేను ఉదయం ఆయనను కలిశాను .. సాయంత్రం ఆయన ఫంక్షన్ కి వచ్చేశారు. ఆ తరువాత బాలకృష్ణ .. ఎన్టీఆర్ కూడా నన్ను ఎంకరేజ్ చేశారు" అని చెప్పాడు.







# దెయ్యంతో రొమాన్స్ 'లవ్ మీ' టీజర్ రిలీజ్!

దెయ్యం అనే ఒక ఆలోచన చాలామందిని భయపెట్టే ఒక అంశంగానే కనిపిస్తుంది. ఫలానా బంగళాలో దెయ్యం ఉందనే ప్రచారం జరిగితేనే ఆ వైపు వెళ్లడానికి భయపడతారు. చీకటిపడితే ఆ దారిలో వెళ్లడానికి కూడా ఆలోచన చేస్తారు. ఇక కొంతమంది మాత్రం, అందరూ అనుకుంటున్నట్టుగా అక్కడ దెయ్యం ఉందా? లేదా? అనే విషయాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు.కానీ ఒక యువకుడు మాత్రం ఫలానా బంగళాలో దెయ్యం ఉందని తెలుసుకుని, దానితో రొమాన్స్ చేయాలనుకుంటాడు. దెయ్యానికి బాయ్ ఫ్రెండ్ గా మారడంలో .. దానితో రొమాన్స్ చేయడంలో ఉండే కిక్ వేరని భావిస్తాడు. ఈ ఆలోచనను అతను తన గాళ్ ఫ్రెండ్ తో షేర్ చేసుకోవడం ఒక ఎత్తయితే, ఆమెను వెంట బెట్టుకుని ఆ దెయ్యం దగ్గరికి వెళ్లడం మరో ఎత్తు. ఈ కథాంశంతో రూపొందిన సినిమానే 'లవ్ మీ'. దిల్ రాజు బ్యానర్ లో నిర్మితమవుతున్న ఈ సినిమాకి, అరుణ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఆశిష్ - వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా వదిలిన టీజర్, యూత్ లో ఆసక్తిని పెంచుతోంది. కీరవాణి అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకి హైలైట్ గా నిలుస్తుందని అంటున్నారు.

# జగతి మేడం అందం చూడతరమా..!



తెలుగు ప్రేక్షకులకు గుప్పెడంత మనసు సీరియల్ తో జగతి మేడంగా సుపరిచితురాలు అయిన నటి జ్యోతి రాయ్ ఈ మధ్య కాలంలో వార్తల్లో తెగ నిలుస్తోంది. సోషల్ మీడియాలో తన అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఎప్పటికప్పుడు వైరల్ అవుతోంది. ఇన్ని రోజులు సీరియల్ లో చూసి ఆంటీ అనుకున్నాం అని, కానీ మీరు అమ్మాయిలా ఉన్నారంటూ చాలా మంది ఆమె ఫోటోలకు కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా మరోసారి అందమైన ఫోటోలను షేర్ చేసి నెట్టింట అందరిని కవ్విస్తోంది. బంగారు వర్ణపు డ్రెస్ లో క్లీ వేజ్ షో చేస్తూ కవ్విస్తున్నట్లుగా చూస్తున్న జ్యోతి రాయ్ ఫోటోలు చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఆకట్టుకునే అందంతో పాటు అరుదైన షో అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఫోటోలను లైక్ చేస్తూ షేర్ చేస్తున్నారు. ఈ రేంజ్ లో అందాల ప్రదర్శన హీరోయిన్స్ కి కూడా సాధ్యం కాదేమో అన్నట్లుగా కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే మరి కొందరు ఇంత అందాల ప్రదర్శన చేస్తున్న జ్యోతి రాయ్ కి రావాల్సిన గుర్తింపు రావడం లేదు.. దక్కాల్సిన సినిమా ఆఫర్లు దక్కడం లేదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# బెస్ట్ యాక్టర్ గా ఆనంద్ దేవరకొండ.. కెరీర్ లో ఫస్ట్ అవార్డ్!

ఆనంద్ దేవరకొండ... టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ తమ్ముడిగా తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. దొరసాని మూవీతో హీరోగా మారారు. సీనియర్ నటుడు రాజశేఖర్ కుమార్తె శివాత్మిక హీరోయిన్ గా నటించిన ఆ మూవీతో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. ఆ తర్వాత ఓటీటీలో మిడిల్ క్లాస్ మెలోడిస్ మూవీతో ఓటీటీలోకి వచ్చారు ఆనంద్. ఓటీటీ ఆడియెన్స్ ను బాగా ఆకట్టుకున్న ఈ చిత్రంతో ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చారు ఆనంద్ దేవరకొండ. ఆ తర్వాత పుష్పక విమానం, హైవే వంటి చిత్రాలు చేసినా.. అనుకున్న స్థాయిలో మెప్పించలేకపోయారు. ఇక సాయి రాజేశ్ దర్శకత్వంలో బేబీ సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు బేబీ సినిమాలో హార్ట్ టచింగ్ పెర్ఫామెన్స్ కు గాను గామా అవార్డు కైవసం చేసుకున్నారు ఆనంద్ దేవరకొండ. దుబాయ్ లో ఘనంగా జరిగిన ఈ వేడుకకు హాజరైన ఆనంద్.. గామా నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. బ్లాక్ కలర్ షూట్ లో వచ్చిన ఆనంద్.. తన లుక్స్ తో ఆకట్టుకున్నారు. అవార్డు అందుకున్న అనంతరం వేడుకను ఉద్దేశించి ప్రసంగించారు. సినిమా రిజల్ట్ తో సంబంధం లేకుండా రొటీన్, రెగ్యులర్ ఫార్మాట్ కమర్షియల్ సినిమాలకు భిన్నమైన మూవీస్ చేస్తూ నటుడిగా పేరు తెచ్చుకున్న ఆనంద్ కు కెరీర్ లో ఇదే ఫస్ట్ బిగ్ అవార్డ్. బేబీ సినిమాకు గాను ఆనంద్ పడిన కష్టానికి దక్కిన బహుమతిగా గామా అవార్డును వర్ణించవచ్చని సినీ పండితులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆనంద్ దేవరకొండ మూడు చిత్రాల్లో నటిస్తున్నారు. గం గం గణేశా, డ్యూయెట్ సినిమాలతో పాటు బేబీ టీమ్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న మరో మూవీలో యాక్ట్ చేస్తున్నారు. మరికొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ చర్చల దశలో ఉన్నాయి. అయితే ఆనంద్ కొత్త చిత్రాలు.. ఈ ఏడాదిలోనే రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. మరి ఆనంద్ దేవరకొండ.. తన కొత్త చిత్రాలతో ఎలా అలరిస్తారో చూడాలి